సాక్షి శ్రీకాకుళం

బుధవారం ǀ 9 ǀ ఆగస్టు ǀ 2023



ప్రతి ఇంటిని సందర్శించి..

ఎచ్చెర్ల నియోజకవర్గంలో గడపగడపకూ మన ప్రభుత్వం పూర్తయ్యింది. 93,047 కుటుంబాలను సందర్శించారు. - 8లో



సర్టిఫికెట్ల జారీపై విచారణ

తోలాపిలో సదరం సర్టిఫికెట్ల జారీపై విచారణ చేస్తున్నారు. నివేదిక కలెక్టర్‌కు అందజేయనున్నారు. - 8లో

సుబ్రహ్మణ్య స్వామికి కృత్తికా పూజలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని ఉమా రుద్ర కోటేశ్వర స్వామి ఆలయం వద్ద గల సుబ్ర హ్మణ్య స్వామి ఆలయంలో స్వామికి మంగళ వారం కృత్తికా నక్షత్రం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు పెంట కిరణ్ శర్మ స్వామికి అభిషేకాలు, ఆవరణార్చన, కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

న్యూస్‌రీల్

నేడు ఐటీఈపీ ప్రవేశ పరీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: నాలుగేళ్ల సమీకృత డిగ్రీ కోర్సు (ఐటీఈపీ) ప్రవేశ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బుధవారం నిర్వహించనుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు తెలిపారు. వర్సిటీలో ఈ ఏడాది ఈ కోర్సు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. బీఎస్సీ బీఎడ్‌లో 50, బీఏ బీఎడ్‌లో 50 సీట్లతో ఈ కోర్సు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జిల్లా విద్యార్థులకు విశాఖపట్నం కేంద్రం కేటాయించారని, ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుందని అన్నారు. మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు దేశంలో 127 కేంద్రాల్లో పరీక్ష ఉంటుందని చెప్పారు. 42 విద్యా సంస్థల్లో ఈ కోర్సు ఈ ఏడాది ప్రారంభమవుతుందని అన్నారు. 3930 సీట్లకు జాతీయ స్థాయిలో 16,000 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు.

నిర్మాణాల పరిశీలన



అక్రమ నిర్మాణాలను తనిఖీ చేస్తున్న ఆర్‌డీ రోహిణి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలోని కిమ్స్ రోడ్డు, డే అండ్ నైట్, చిన్నబజారు, అంబేడ్కర్ కూడలి నుంచి ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో పలు ఆస్పత్రుల భవన నిర్మాణాలపై ఫిర్యాదులు వెళ్లగా.. ప్రణాళిక విభాగం రీజనల్ డైరెక్టర్ రోహిణి బృందం మంగళవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనలను విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలను ప్రభుత్వానికి నివేదించి తదుపరి ఆదేశాలను అనుసరించి చర్యలు చేపడతామన్నారు. ఆర్‌డీతో పాటు టౌన్‌ప్లానింగ్ విభాగం టీపీఓ ఉమామహేశ్వరరావు, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

'పాఠశాలల్లో పీడీలే ఆల్‌రౌండర్లు'



డీఈఓ వెంకటేశ్వరరావును అభినందిస్తున్న పీఈటీ సంఘ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు వ్యాయామంతోపాటు అన్నింటా అభివృద్ధికి బాటలు వేసే ఆల్‌రౌండర్లుగా నిలుస్తారని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. పాఠశాలల్లో వ్యాయామ విద్యకు పెద్దపీట వేసి విద్యార్థులను ఆరోగ్యవంతులుగా, ఉన్నతమైన క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని ఆయన ఆకాంక్షించారు. నూతన డీఈఓగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వరరావును మంగళవారం జిల్లా పీడీ–పీఈటీ సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పీడీ, పీఈటీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డీఈఓను కలిసినవారిలో జిల్లా పీడీ పీఈటీ సంఘ అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బీవీ రమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, మెట్ట తిరుపతిరావు, ఎం.ఆనంద్‌కిరణ్ ఉన్నారు.

కేసుల్లో పురోగతి సాధించాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : దర్యాప్తులో నైపుణ్యాన్ని పెంచుకుని కేసుల్లో పురోగతి సాధించాలని, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలోని అధికారులతో మంగళవారం నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పెండింగ్ ఫిర్యాదులు, తీవ్రమైన (గ్రేవ్ కేసులు) నేరాలు, ఎస్సీ, ఎస్టీ, పోక్సో, మిస్సింగ్, నాన్‌బెయిల్ వారెంట్లు తదితర అంశాలపై మాట్లాడటమే కాకుండా ముఖ్య కేసుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరం జరిగిన వెంటనే నేర స్థలానికి చేరుకుని అక్కడ క్షుణ్ణంగా పరిశీలించి సాక్ష్యాధారాలు సేకరించి కేసు ప్రాపర్టీ స్వాధీనంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆస్తి నేరాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మిస్సింగ్ కేసులు త్వరితగతిన ఛేదించాలని, పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను పరిశీలించి వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. సైబర్ మోసాల గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.

● శిరీష

చిర్రుబుర్రులే హమేషా

- విచిత్రకర పరిస్థితిలో గౌతు శిరీష
- డబ్బు, బ్యాగ్రౌండ్, అహంతో అందరిని అణగదొక్కే ప్రయత్నం
- గతంలో జుత్తు తాతారావుతో వైరం
- తాజాగా వజ్జ బాబూరావుతో విభేదాలు
- టిక్కెట్‌కు అడ్డొస్తారని సీనియర్ నేతలను పక్కనపెట్టే యత్నం
- శిరీష తీరును వ్యతిరేకిస్తున్న సొంత పార్టీ నాయకులు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: తన కోపమే తన శత్రువని అంటారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన గౌతు శిరీషకు మాత్రం తన అహమే తన శత్రువవుతోంది. ప్రత్యర్థి నేతలతో పాటు స్వపక్ష నాయకులతోనూ వైరం పెంచుకుంటున్న ఆమె వింత వైఖరి అసమ్మతి సెగ రేపుతోంది. ఇంటా బయటా నాయకులు తనకంటే సీనియర్స్ కావడంతో ఆమె తట్టుకోలేకపోతున్నారు. అరవై ఏళ్ల రాజకీయ చరిత్ర ఉన్న తన కుటుంబానికి ఇన్నాళ్లూ అండగా ఉన్న నేతలే తనకు అడ్డు తగులుతారేమో అన్న అభద్రతా భావంలో ఉన్నారు. తాతతండ్రుల చరిత్రలు చెబుతూ నిత్యం అహంతో వ్యవహరించడం తప్ప సొంత ముద్ర వేసుకోలేక సతమతమవుతున్నారు.

వాస్తవానికి సర్దార్ గౌతు లచ్చన్న మనవరాలిగా పెత్తనం చెలాయించడం తప్ప గౌతు శిరీష పేరు ప్రత్యేకంగా చెప్పుకోవడానికి ఏమీ లేదు. గౌతు శ్యామసుందర్ శివాజీ రాజకీయంగా కనుమరుగు అవుతుండటంతో వారసత్వ రాజకీయాల్లో భాగంగా ఆమె తెరపైకి వచ్చారు. వారసత్వ రాజకీయం సిక్కోలుకు కొత్త కాకపోయినా.. విశాఖపట్నంలో ఉండి ఇక్కడ రాజకీయాలు చేసి గద్దెనెక్కాలనే ఆమె ఆలోచన ఎవరికీ నచ్చడం లేదు. ప్రతి విషయంలో డబ్బును, బ్యాగ్రౌండ్‌ను చెప్పుకోవడం, ఏ మండలంలో ఏ ఊరు ఎక్కడుందో కూడా తెలియక పోవడం, ప్రజల మన్ననలతో కాకుండా వారసత్వం పేరుతో పెత్తనం చెలాయించాలన్న ఆలోచన ఇప్పుడామె కొంప ముంచుతోంది. ఇంతవరకు కుటుంబానికి అండగా నిలిచిన నాయకులే ఇప్పుడు ఎదురుతిరిగే పరిస్థితి ఏర్పడింది.



అధికార పార్టీ నాయకులపైన విమర్శలు, ఆరోపణలు చేస్తే అది రాజకీయం అనుకోవచ్చు. కానీ ఉన్నవీ లేనివీ మాట్లాడి నోరు పారేసుకోవడం వల్ల ఇప్పటికే నియోజకవర్గంలో ఆమె ప్రతిష్ట మసకబారిపోయింది. అది చాలదన్నట్టు సొంత పార్టీ నేతలను దూరం చేసుకునే పరిస్థితి ఏర్పడుతోంది. రానున్న ఎన్నికల్లో ఎక్కడ టిక్కెట్‌కు పోటీ పడతారేమోనన్న అభద్రతా భావంతో స్వపక్షంలోనే నాయకులతో వైరం పెట్టుకుంటున్నారు. ప్రస్తుతానికి తనకు తప్ప ఎవ్వరికీ ఎమ్మెల్యే సీటు దక్కకూడదనే ఉద్దేశంతో పార్టీలో ఎదగాల్సిన నాయకులను వెనక్కు నెట్టేందుకే ప్రయత్నిస్తున్నారు. ఇన్‌కంటాక్స్‌లో ఆఫీసర్‌గా పనిచేసి వచ్చిన ఉద్దాన వాసి జుత్తు తాతారావు ఎమ్మెల్యే టిక్కెట్టు ఆశించడంతో ఆయనతో విభేదాలు పెట్టుకుని ఆయన పార్టీకి దూరంగా ఉండేలా జాగ్రత్త పడ్డారు. తాజాగా పలాస–కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ వజ్జ బాబూరావుకు చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో టిక్కెట్ కోసం పోటీ పడతారన్న ఉద్దేశంతో ఆయన్ని అణగదొక్కేలా వ్యవహరిస్తున్నారు. దానిలో భాగంగానే ప్రతి చిన్న విషయంలో వజ్జ బాబురావు అండ్‌కోపై చిర్రుబుర్రులాడుతున్నారు. సొంత పార్టీ నాయకుల సీనియారిటీని సైతం విస్మరించి తన చెప్పుచేతుల్లో ఉండేలా హుకుం జారీ చేస్తున్నారు. ఇటీవల శిరీష రాకుండా ఆఫ్‌షోర్ ప్రాజెక్టు చూసేందుకు ప్రతిపక్ష పాత్రలో వెళ్లారంటూ వజ్జపై రుసరుసలాడారు. చెప్పాలంటే వజ్జ బాబూరావును అవమాన పరిచేలా పలు సందర్భాల్లో వ్యవహరించారు. సీనియర్ అయినప్పటికీ తన వెనుక ఉండాలే గానీ తన మాట దాటొద్దంటూ ఆంక్షలు విధించారు. వజ్జ బాబూరావుకు ఏ ఒక్కరు జై కొట్టినా సహించలేకపోతున్నారు. దీంతో శిరీషకు సహజంగానే అసమ్మతి పోరు మొదలైంది. వజ్జ బాబూరావు వర్గీయులంతా ఇప్పుడామెపై గుర్రుగా ఉన్నారు. విశాఖలో ఉండి, పార్టీ పిలుపు సమయంలో ఇక్కడికొచ్చి కార్యక్రమాలు చేపట్టి, తర్వాత వెళ్లిపోయి కేడర్‌ను గాలికొదిలేసిన శిరీష వెంట ఎలా ఉండగలమని వ్యతిరేక వర్గమంతా బాహాటంగానే నిరసన గళం విప్పుతున్నారు. ఆ స్వరం రోజురోజుకీ ఎక్కువై నియోజకవర్గంలో టీడీపీ వర్గాలుగా చీలిపోయింది.

చంద్రబాబు పొలిటికల్ టెర్రరిస్ట్

- పుంగనూరు ఘటన చంద్రబాబు చేసిందే
- చంద్రబాబు, లోకేష్‌లపై హత్యాయత్నం కింద కేసు పెట్టాలి
- లోకేష్ పోటీ చేసే నియోజకవర్గం చెప్పగలిగితే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- రాష్ట్రంలో ప్రాజెక్టులకు జీవం పోసింది వైఎస్సార్ కుటుంబమే
- మంత్రి సీదిరి అప్పలరాజు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చంద్రబాబు, లోకేష్‌లు రాష్ట్రానికి పట్టిన చీడ పురుగులని, సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల కోసం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులను అడ్డుకోవడమే వారి పని అని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మండిపడ్డారు. చంద్రబాబు పొలిటికల్ టెర్రరిస్ట్ అని, అసాంఘిక శక్తిగా మారి రాష్ట్ర ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని దుమ్మెత్తిపోశారు. శ్రీకాకుళంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. పుంగనూరు ఘటనకు ప్రధాన కారకుడు చంద్రబాబేనని, పోలీసులపై కనీస గౌరవం లేకుండా కార్యకర్తలను వారిపైకి రెచ్చగొట్టారని ఆరోపించారు. బాబు, లోకేష్‌లపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలన్నారు. ఈ ఘటనపై పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదో చెప్పాలని, దానికీ ప్యాకేజీ కావాలా అని ప్రశ్నించారు. నారా లోకేష్ పోటీ చేసే నియోజకవర్గం ఏదో చెప్పగలిగితే తాను రాజకీయాలను నుంచి తప్పుకుంటానన్నారు. ఎక్కడ పోటీ చేసినా గెలవలేవన్న నమ్మకంతో ప్రజల్ని రెచ్చగొట్టి రాజకీయంగా సానుభూతి పొందాలనుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలు ఇప్పటికే టీడీపీకి 23 సీట్లు ఇచ్చి తగిన బుద్ధి చెప్పారన్నారు.

ఆ అర్హత లేదు బాబు

ప్రాజెక్టులను సందర్శించే అర్హత చంద్రబాబుకు లేదని, 14 ఏళ్లు సీఎంగా ఉండి రాష్ట్రాన్ని రావణ కాష్టం చేశారని అన్నారు. రాయలసీమలో ఒక్క ప్రాజెక్టుకు కూడా శంకుస్థాపన చేయకుండా ఎడారిలా తయారు చేశారన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలోనే రాష్ట్రంలో ప్రాజెక్టులు పరుగులు పెట్టాయని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో వంశధార స్టేజ్–2, ఫేజ్–2లను వైఎస్సార్ రూ.900కోట్లతో ప్రారంభిస్తే ఆయన తనయుడు వైఎస్ జగన్ మిగిలిన పనులకు నిధులు కేటాయించి జిల్లాను సస్యశ్యామలం చేసే దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో నీరు–చెట్టు పేరుతో కోట్లాది రూపాయలు బొక్కేశారన్నారు. జిల్లాలో ఆఫ్‌షోర్, సైడ్‌వియర్, నేరడిబ్యారేజీ నిర్మాణాల కోసం నిధులిచ్చింది వైఎస్సార్ కుటుంబమేనని, జిల్లా ప్రజలు వైఎస్సార్ కుటుంబానికి రుణపడి ఉంటారని తెలిపారు.

ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ రాష్ట్రాన్ని విడగొట్టే చరిత్ర పుటల్లో చిరంజీవి పాత్ర ఉందన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. ఎంపీగా ఉన్నంత కాలం ఒక్కనాడైనా ప్రత్యేక హోదా కోసం మాట్లాడని చిరంజీవికి ఇప్పుడెందుకు రాష్ట్రం గుర్తొచ్చిందో చెప్పాలన్నారు. రాజకీయాలు విడిచిపెట్టిన చిరు మళ్లీ రాజకీయాల గురించి మాట్లాడడం సరికాదన్నారు. ఏదైనా ఉంటే మీ తమ్ముడు పవన్‌కు సహకరించి పార్టీని గెలిపించుకుని మాట్లాడాలన్నారు. మూలపేట పోర్టుకు వైఎస్ జగన్ ఏడాదిలో నిర్వాసితులకు ప్యాకేజీలు ఇచ్చి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు కూడా ప్రారంభించారని తెలిపారు. సమావేశంలో కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, శిమ్మ రాజశేఖర్, కింతలి రమేష్, రౌతు శంకరరావు, నర్సింగరావు, మైలపల్లి పోలీస్, మూగి గురుమూర్తి, లాయర్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

'లంపీస్కిన్ టీకాలు వేయాల్సిందే'

లావేరు: పశువులకు తప్పకుండా లంపీ స్కిన్ నిరోధక టీకాలు వేయించాలని బెజ్జిపురం, లావేరు పశువైద్య కేంద్రాల వైద్యులు డాక్టర్ జి.లావణ్య, డాక్టరు బి.గాయత్రి అన్నారు. మండలంలోని గుమడాం, తాళ్లవలస, రావివలస, లావేరు గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో టీకాలు వేశారు. పశువైద్యుల పర్యవేక్షణలో సచివాలయాల వెటర్నరీ అసిస్టెంట్లు కార్యక్రమాన్ని నిర్వహించారు. కాప్రీపోక్సు అనే వైరస్ ద్వారా దోమలు, ఈగలు కుట్టడం వల్ల ఆవులు, గేదెల్లో లంపీ స్కిన్ వ్యాధి వస్తుందన్నారు.

3వ విడత వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా నేడు



శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీ తోఫా మూడో విడత కార్యక్రమం బుధవారం జరగనుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో తొలిసారిగా జిల్లా నుంచి 125 జంటలకు గాను రూ.80.10 లక్షలు అందజేశారు. రెండో విడతలో ఈ ఆర్థిక సంవత్సరం తొలిరోజుల్లో 930 జంటలకు గాను రూ. 525.75 లక్షలు అందజేశారు. మూడో విడతలో 1436 జంటలకు రూ.876.25 లక్షల నగదు ఇవ్వనున్నారు.

ఊరికి పచ్చల హారం

- స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఊరూరా మొక్కల నాటివేత
- స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం



నిర్మాణంలో ఉన్న శిలాఫలకం

శ్రీకాకుళం పాతబస్టాండ్: పంద్రాగస్టు వేడుకల సందర్భంగా ఊరికి పచ్చల హారం అలంకృతం కానుంది. నా మట్టి– నాదేశం అనే కార్యక్రమంలో భాగంగా ఊరూరా మొక్కలు నాటే మహోన్నత కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టనున్నారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని సచివాలయాలు,పంచాయతీ స్థలాలు, పార్కుల్లో కూడా మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

ఈ కార్యక్రమానికి ఉపాధి హామీ పథకం నిధులు ఉపయోగించుకోనున్నారు. జిల్లా వ్యాప్తంగా 910 పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఒక్కో చోట 75 వివిధ రకాల మొక్కలు చొప్పున, మొత్తం 68,250 మొక్కలను నాటేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈ బృహత్తర కార్యక్రమం కలకాలం గుర్తుండేలా గ్రామగ్రామాన ఒక ఫలకాన్ని ఏర్పాటు చేసి, వాటిలో ఈ కార్యక్రమం ఆవశ్యకతను వివరించనున్నారు. ఇప్పటికే ఎక్కడెక్కడ మొక్కలు నాటాలో ఆయా ప్రదేశాలను గుర్తించారు. అక్కడకు కావాల్సిన మొక్కలు మరో రెండు రోజుల్లో చేరనున్నాయి. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో శిలాఫలకాల ఏర్పాటు కూడా దాదాపు పూర్తయ్యింది. దీంతో పాటు ఆగస్టు 15వ తేదీన పండగ వాతావరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టనున్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణకు అవసరమైన చర్యలను ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా చేపట్టనున్నారు. సంరక్షణ కోసం ప్రత్యేకంగా నిధులను కూడా కేటాయించారు. ఈ పథకంలో గ్రామ స్థాయిలో ప్రజా ప్రతినిధులతో పాటు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యకర్తలు, సిబ్బంది, ఉపాధి హామీ వేతనదారులు భాగస్వాములు కానున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

మొక్కలు నాటే కార్యక్రమం పెద్ద ఎత్తున పండగ వాతావరణంలో నిర్వహించనున్నాం. ఇప్పటికే మార్గదర్శకాలు అన్ని స్థాయిల అధికారులకు అందజేశాం. ఊరూరా శిలాఫలకంతోపాటు, ప్రతి పంచాయతీలో సచివాలయం, ఇతర సామాజిక ప్రాంతాల్లో 75 రకరకాల మొక్కలను నాటే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. – జీవీ చిట్టిరాజు, పీడీ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ.

నేడే 'నా మట్టి–నా దేశం' ప్రారంభం

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళంలోని గాంధీ స్మృతి వనంలో బుధవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ చేతులమీదుగా నా మట్టి–నాదేశం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు కార్యక్రమ నోడల్ అధికారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ చిట్టి రాజు తెలియజేశారు. నేడు దేశవ్యాప్తంగా 'నా మట్టి–నా దేశం', 'నేల తల్లికి నమస్కారం–వీరులకు వందనం' ఆజాదీకా అమృత్ మహోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించే ఈ కార్యక్రమాలను ఆగస్టు 15వ తేదీలోపు పూర్తి చేస్తామని పీడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 910 పంచాయతీల్లో ఒక్క పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో 75 మొక్కలు చొప్పున జిల్లా వ్యాప్తంగా 68,250 మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఒక మహోత్సవంగా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గిరి గ్రామాల రోడ్లకు మహర్దశ



చందనగిరి రోడ్డు పనులకు భూమిపూజ చేసున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎమ్మెల్యే రెడ్డిశాంతి చొరవతో నిధులు మంజూరు
- చందనగిరి గిరిజన గ్రామానికి 1.25 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

మెళియాపుట్టి: గిరిజన గ్రామాల ప్రజలకు రహదారి కష్టాలు తీరనున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గిరి గ్రామాల రోడ్లకు మహర్దశ పట్టింది. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రత్యేక కృషితో నిధులు మంజూరు కావడంతో పలు గ్రామాలకు రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ఉత్తరాంధ్రలోనే ఎత్తైన గిరిశిఖర గ్రామమైన చందనగిరి గ్రామానికి రూ.1.25 కోట్లతో 3.10 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం భూమిపూజ చేశారు. అలాగే హడ్డివాడకి 1.75 కోట్లతో 2.3 కిలోమీటర్లు, కేరాసింగికి రూ. 92 లక్షలతో 1.5 కిలోమీటర్లు, కేరాసింగిగూడకు రూ.1.5 కోట్లతో 2.5 కిలోమీటర్లతో రోడ్డు పనులు చేపడుతున్నారు. ఈ పనులను కూడా ఆమె పరిశీలించారు. మొత్తం రూ. 5.42 కోట్లతో గిరి శిఖర గ్రామాలకు వెళ్లే రహదారి పనులు చేపడుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు బైపోతు ఉదయ్‌కుమార్, మండలకన్వీనర్ పల్లి యోగి, పీఏసీఎస్ అధ్యక్షుడు బాలరాజు, సర్పంచులు వసంతకుమారి, జయమ్మ, జమ్మయ్య, రామచంద్ర మజ్జి, భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యురాలు సరోజిని, నాయకులు జయమునిరావు, శశిభూషణరావు, వెంకటేష్, పాపారావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను అధిగమిద్దాం

- ప్రతి మాసం పురోగతి కనిపించాలి
- రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ సమీర్ శర్మ



సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, పక్కనే డాక్టర్ సమీర్ శర్మ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు ప్రత్యేకంగా దృష్టి సారించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ సమీర్ శర్మ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో కలిసి వైద్య, విద్య, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో ఆయన సమీక్షించారు. తొలుత మండలాధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన జిల్లాలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో గర్భిణుల వివరాలు సేకరించి, వారిలో రక్తహీనత లోపం లేకుండా చూడాలని సూచించారు. అలాగే వారికి కావాల్సిన పౌష్టికాహారాన్ని అందించాల్సిన బాధ్యత ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందిపై ఉందని స్పష్టం చేశారు. అధిక రక్తహీనత కేసులు జిల్లాలో లేవని, చిన్నపాటి సమస్యలు ఉన్న వారికి మందులు, పౌష్టికాహారం అందించాలన్నారు.

సరుబుజ్జిలి మండలం కొండవలస, ఇచ్ఛాపురం మండలం లాలాపేట, నరసన్నపేట రూరల్, కోటబొమ్మాళి మండలం ఈదువలస గ్రామాల్లో రక్తహీనత లోపం ఉన్న గర్భిణులకు తీసుకుంటున్న చర్యలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఐదేళ్ల లోపు వయసు గల పిల్లలు తగిన బరువు లేకపోవడంపై ఆరా తీసిన ఆయన మందస, కోటబొమ్మాళి మండలం లక్కసిద్ధి, మెళియాపుట్టి మండలం వెంకటాపురం తదితర గ్రామాల్లోని పిల్లలు వయసుకు తగిన బరువు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బడి మాని వేసిన పిల్లల వివరాలు వలంటీర్ల ద్వారా తెలుసుకుని, వారిని తిరిగి బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కాలుష్య నియంత్రణపై సమీక్షించిన ఆయన జిల్లాలో గల 550 ఆస్పత్రుల్లో 4,834 పడకలు ఉండగా వాటి నుంచి వచ్చే బయో మెడికల్ వేస్టేజీను ఎప్పటికప్పుడు డంపింగ్ చేయాలని అన్నారు. వేస్టేజీను తరలించేందుకు అవసరమైన రవాణా సదుపాయం కల్పించాలని, అలాగే వాటికి ఎప్పటికప్పుడు చెల్లింపులు చేయాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తరచూ సమావేశాలు ఏర్పాటుచేయాలని అన్నారు. నిషేధిత ప్లాస్టిక్ పరిశ్రమలు, విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ముఖ్యప్రణాళికాధికారి వి.ఎస్.ఎస్.ఎల్.ప్రసన్న, జెడ్పీ ముఖ్యకార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట రామన్, ఐసీడీఎస్ పథక సంచాలకులు డాక్టర్ జి.జయదేవి, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఆర్.జయప్రకాష్, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి, కాలుష్య నియంత్రణ మండలి జేడీ ఏ.సుబ్బారావు, పర్యవేక్షక ఇంజినీర్ ప్రసాదరావు, కార్యనిర్వాహక ఇంజినీర్ రామారావు నాయుడు, ఏఈఈలు పద్మావతి, హరీష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రవాణా అనుమతులు ఇప్పించాలి


జేడీ సుధాకర్‌తో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

పలాస: వ్యవసాయ మార్కెటు కమిటీకి సంబంధించిన ట్రాన్స్ పోర్టు పర్మిట్లు ఇప్పించాలని పలాస కాష్యూ మ్యానిఫేక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్, పారిశ్రామిక వాడ జీడి పప్పు ఉత్పత్తులదారుల సంఘం అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్ కోరారు. పలాస ఏఎంసీ కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ సుధాకర్ నెలవారీ సమీక్షలో భాగంగా అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అతన్ని జీడి వ్యాపారుల సంఘం ప్రతినిధులు కలిసి స్థానిక సమస్యలను విన్నవించారు. ఏఎంసీ అధ్యక్షుడు పి.వి.సతీష్ కూడా జేడీ దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. ముఖ్యంగా జీడి రైతులు, వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

చికిత్స పొందుతూ యువతి మృతి


సవర పవిత్ర (ఫైల్)

మెళియాపుట్టి: జాడుపల్లి గ్రామ పంచాయతీ పరిధి గొల్లబంజీరు గ్రామానికి చెందిన సవర పవిత్ర (19) అనారోగ్య, కుటుంబ కష్టాలతో మనస్తాపానికిగురై ఈ నెల ఆరో తేదీన ఇంట్లో ఉన్న పురుగుమందు ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనం ద్వారా శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి పవిత్ర మృతి చెందినట్టు ఎస్సై రాజేష్ మంగళవారం తెలిపారు. మృతురాలి తల్లి భారతి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం నగరంలోని కాకివీధిలోని ఓ పిండిమిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించి పట్టుకున్నారు. శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అమలు అధికారి ఎ.సురేష్‌బాబు ఆదేశాల మేరకు కాకివీధిలోని బోడెమ్మ కోవెల సమీపంలో ఉన్న మహ్మద్ ఇజహార్‌కు చెందిన పిండి మిల్లులో పీడీఎస్ బియాన్ని అక్రమంగా నిల్వ చేసి ఉన్నట్టు అందిన సమాచారం మేరకు దాడులు చేశారు. ఈ సందర్భంగా రూ. 85,500 విలువైన 2,250 కిలోల బియాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి ఇజహార్ కొనుగోలు చేసి పిండిగా మార్చి అధిక ధరలకు విక్రయించేందుకు నిల్వ చేసినట్లు అధికారులు తమ దర్యాప్తులో గుర్తించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. దాడుల్లో విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ డి.వి.వి.సతీష్, రెవెన్యూ ఆర్ఐ కిరణ్‌దేవ్, వీఆర్వో నాగేశ్వరరావు, హెచ్‌సీ రామ్మోహన్, పీసీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ జిల్లా కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

శ్రీకాకుళం: జిల్లా హ్యూమన్ రైట్స్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఏపీ స్టేట్ అధ్యక్షుడు అల్లు ఇమ్మానుయేలు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడుగా టొంపల పేతురు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా టొంపల సూరప్పడు, వైస్ ప్రెసిడెంట్‌గా బైరి ప్రకాశరావు, జనరల్ కార్యదర్శిగా గుడివాడ ఆదినారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం మండల ప్రెసిడెంట్‌గా సంతోష్ హర్షను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

ప్రతి ఇంటిని సందర్శించి.. సమస్యలు పరిష్కరించి..

- ఎచ్చెర్ల నియోజకవర్గంలో పూర్తయిన 'గడప గడపకు మన ప్రభుత్వం'
- 93,047 కుటుంబాలను కలిసిన ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

నియోజకవర్గంలో కార్యక్రమం నిర్వహణ ఇలా..

మండలం	గ్రామ సచివాలయాలు	సందర్శించిన కుటుంబాలు
రణస్థలం	28	26,875
లావేరు	23	20,633
జి.సిగడాం	21	17,939
ఎచ్చెర్ల	28	27,600
మొత్తం	100	93,047


జీరుపాలెం గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విరిగిపడి ఉన్న కొబ్బరిచెట్టును దాటివెళ్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


గొరుసుపూడిపేటకు నిర్మించిన గ్రావెల్‌రోడ్డు

రణస్థలం: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఎచ్చెర్ల నియోజకవర్గంలో ముగిసింది. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సారథ్యంలో వంద గ్రామ సచివాలయాల్లో దిగ్విజయంగా పూర్తయింది. 248 రోజులపాటు ఎండ, వాన, చలిని లెక్కచేయకుండా అన్ని గ్రామాల్లో పర్యటించి 93,047 గృహాలను సందర్శించి జగనన్న పాలనను విస్తృతంగా ప్రచారం చేయడంలో ఎమ్మెల్యే సఫలీకృతమయ్యారు. ప్రజలతో మమేకమవుతూ.. సమస్యలు వింటూ అక్కడిక్కడే అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించి ప్రజల మన్ననలను పొందారు.

విలీన గ్రామాల్లో కూడా..

ఎచ్చెర్ల మండలంలోని రెండు గ్రామ సచివాలయాలైన తోటపాలెం, కుశాలపురం శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమయ్యాయి. అయినప్పటికీ ఈ గ్రామాల్లో కూడా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ నిర్వహించారు. జిల్లాలోనే 'గడప గడపకు మన ప్రభుత్వం' పూర్తయిన నియోజకవర్గంగా ఎచ్చెర్ల నిలిచింది. ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ స్వగ్రామమైన రణస్థలం మండలం పాతర్లపల్లి గ్రామ సచివాలయం పరిధిలో కార్యక్రమాన్ని చివర్లో నిర్వహించారు.

అభివృద్ధి ఫలాలు

ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి నిధులు విడుదల అయ్యాయి. ఒక్కో సచివాలయానికి మంజూరైన రూ. 20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించారు. అలాగే ఎమ్మెల్యే సొంత నిధులతో బోర్లు ఏర్పాటు, అంబేడ్కర్ విగ్రహాల నిర్మాణం, గ్రావెల్ రహదారులను ఏర్పాటు చేశారు.

దీర్ఘకాలిక సమస్యలకు చెక్

- లావేరు మండలంలోని అదపాక కాజ్‌వేను రూ. 20 లక్షలతో నిర్మాణం. లక్ష్మీపురంలో రెండు, హనుమంతుపురంలో మూడు సీసీ రోడ్ల నిర్మాణం
- 30 గ్రామాలకు అనుసంధానంగా ఉన్న వెంకటాపురంలో సీసీ రోడ్డు నిర్మాణం
- జి.సిగడాం మండలంల డి.ఆర్.వలసలో 14 ఏళ్ల దివ్యాంగుడు మణికంఠకు సదరం సర్టిఫికెట్ ఇప్పించి పింఛన్ మంజూరు
- వెలగాడ పంచాయతీ గొరుసుపూడిపేటకు సీఎం డెవలపెమెంట్ ఫండ్ ద్వారా ఒక్క రోజులోనే గ్రావెల్ రోడ్డు ఏర్పాటు
- జె.ఆర్.పురంలో విద్యుత్ ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి నాలుగు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- దన్నానపేట శ్మశాన వాటికలో బోరు ఏర్పాటు. సీసీ రహదారులు, కాలువల నిర్మాణం
- ఎచ్చెర్ల మండలం జరజాం, అజ్జరాం, సోమ్మలవానిపేట, ముద్దాడలో సీసీ రోడ్లు, డ్రైన్ల ఏర్పాటు
- ఎమ్మెల్యే సొంతనిధులతో జి.సిగడాం మండలం నక్కపేట గ్రామానికి 600 మీటర్ల క్రషర్‌తో రోడ్డు నిర్మాణం
- లావేరు మండలం లావేటిపాలెంలో బోరు, పలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటు ఆర్థిక సాయం. పైడిభీమవరం ఫార్మా కంపెనీల్లో స్థానికులకు ఉద్యోగ కల్పన, తోటపల్లి సాగునీటి కాలువల్లో పూడిక తీతపనుల పూర్తికి కృషి

సీఎం జగన్ ఆశయసాధనకు కృషి



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎచ్చెర్ల నియోజకవర్గంలోని 100 సచివాలయాల్లో పూర్తి చేశా. ప్రజలతో మమేకమవుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేశాను. ఏ గడపకు వెళ్లిన సీఎంగా జగనే మళ్లీ రావాలని అందరూ దీవిస్తుంటే సంతోషంగా ఉంది.

– గొర్లె కిరణ్‌కుమార్, ఎమ్మెల్యే, ఎచ్చెర్ల

మహిళల సంక్షేమం గురించి మీరా మాట్లాడేది?

- టీడీపీ నాయకులపై ఎమ్మెల్సీ దువ్వాడ ఫైర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి రూరల్: టీడీపీ హయాంలో రాష్ట్రంలో మహిళలపై జరిగిన దాడులు ఇంకా ఎవ్వరూ మర్చిపోలేదని, వారు మహిళల సంక్షేమం గురించి మాట్లాడడం ఏంటని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఆయన మంగళవారం టెక్కలిలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో మహిళలకు చాలా అన్యాయం జరిగిందని, అప్పట్లో అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలు వివరించేందుకు హైదరాబాద్ వెళితే అక్కడ వారి సమస్యలు వినకుండా వారిని గుర్రాలతో తొక్కించి, నీటి పైపులతో కొట్టించిన చరిత్ర చంద్రబాబుదని అన్నారు. ఇప్పుడు అచ్చెన్నాయుడు మహిళల సంక్షేమం గురించి మాట్లాడుతుంటే ఆశ్చర్యంగా ఉందన్నారు. ఆయన మంత్రిగా ఉన్న సమయంలో ఒక ఎస్సీ కులానికి చెందిన దళిత మహిళ గుండె మీద తన్ని అత్యంత దారుణంగా ప్రవర్తించారని తెలిపారు. ఒక ఉన్నతాధికారితో సైతం అసభ్యంగా ప్రవర్తించారని, నిమ్మాడలో తన సొంత కుటుంబ సభ్యులైన కింజరావు గణపతి కుమార్తె మేనకను నడిరోడ్డు మీద కొట్టారని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మహిళలకు అన్నింటా అగ్రతాంబూలం ఇచ్చారని గుర్తు చేశారు. పథకాల నుంచి నామినేటెడ్ పదవుల వరకు అన్నింటా వారికి ప్రాధాన్యత కల్పించారన్నారు. ఎన్నడూ లేని విధంగా మహిళలకు ఉపముఖ్యమంత్రి పదవులు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందని అన్నారు. ఇటీవల పవన్ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆయన చెప్పినట్టుగానే అంత మంది అదృశ్యమై ఉంటే ఇప్పటికే కేంద్ర నిఘా బృందాలు రంగంలోకి దిగేవని అన్నారు. ప్రజలను మభ్య పెట్టి వారిని తప్పుదోవ పట్టించి రాష్ట్రంలో అశాంతి కల్పించడమే వారి ఉద్దేశమని దుయ్యబట్టారు. చంద్రబాబు పుంగనూరులో రౌడీలతో రాజకీయం చేయించారని ఆరోపించారు. పవన్ ఉత్తరాంధ్ర వచ్చి వైఎస్ జగన్ చేసిన అభివృద్ధి పనులు చూడాలన్నారు. నాలుగేళ్లలో చెప్పిన ప్రతి మాట చేసి చూపించామని అన్నారు. చంద్రబాబు గానీ పవన్ కల్యాణ్ గానీ ఒంటరిగా పోటీ చేయగలరా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు, టెక్కలి సర్పంచ్ గొండేల సుజాత, ఎంపీటీసీలు పీతల సుజాత, శేఖర్, అప్పన్న, రమేష్, పార్టీ నాయకులు చింతాడ గణపతి, చంటి, దవల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వివిధ పోటీలు రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల పదో తేదీన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు వైస్ చాన్సలర్ నిమ్మ వెంకటరావు తెలిపారు. వర్సిటీలో స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణ కమిటీతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల జాబితాను బుధవారం సాయంత్రంలోగా జిల్లా విద్యాశాఖ అధికారులకు అందజేయాలన్నారు. నవరత్నాలు అమలు–మెరుగైన జీవన ప్రమాణాలు, విద్యా పథకాలు–గుణాత్మకమైన విద్యా సాధన, జాతీయ విద్యాకార్యక్రమం - 2020, నాడు–నేడుతో పాఠశాలల విద్యా ప్రమాణాలు అనే అంశాలపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు.

ఆమె నేత్రాలు సజీవం


పోలాకి సూర్యం

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీపీ నాగజ్యోతి ఆనంద నిలయంలో నాలుగేళ్లుగా ఆశ్రయం పొందుతున్న మహిళ పోలాకి సూర్యం (64) మంగళవారం మృతి చెందారు. దీంతో ఆమె నేత్రాలను దానం చేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు ప్రోత్సాహంతో మగపటల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ద్వారా కార్నియాలను సేకరించి విశాఖపట్నం ఎల్‌వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ వారికి అందజేశారు. కాగా సూర్యం మృతిపై అనురాగనిలయం సభ్యులు, నాగజ్యోతి ఆనంద నిలయం కమిటీ సభ్యులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

గద్దర్ మరణం తీరనిలోటు


గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విప్లవ గాయకుడు, ప్రజా యుద్ధనౌక, వాగ్గేయకారుడు కామ్రేడ్ గద్దర్ మరణం బడుగు బలహీన వర్గాలకు తీరని లోటని దళిత, ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు అన్నారు. గద్దర్ సంస్మరణ సభను అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ప్రజల పక్షాన పోరాడే గద్దర్ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. తన జీవితాన్ని ప్రజల కోసమే అంకితం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజాకవి నల్లి ధర్మారావు, అట్టడ అప్పలనాయుడు, వీజీకే మూర్తి, తాండ్ర ప్రకాష్, కె.వి.జగన్నాథం, కల్లేపల్లి రాంగోపాల్, తాండ్ర అరుణ, పిట్టా చంద్రపతిరావు, డీటీఫ్ నాయకుడు ధర్మారావు, డి.గణేష్, మిస్కా కృష్ణయ్య, ఎస్ కృష్ణవేణి, బోనెల అప్పారావు, తవిటమ్మ, బెలమర ప్రభాకర్, రాకోటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పర్తియాత్ర భజనలు ప్రారంభం


హయాతీనగరం మందిరంలో భజనలు చేస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి బాబా వారి దివ్య ప్రదేశమైన పుట్టపర్తి వెళ్లేందుకు పర్తియాత్ర పూజలు ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం జోనల్ స్థాయిలో లింకు భజనలు హయాతీనగరంలోని సత్యసాయి భజన మండలిలో మంగళవారం ప్రారంభమయ్యాయి. మందిరం కన్వీనర్ కిల్లాన ఫాల్గుణరావు ఆధ్వర్యంలో టి.ఎస్.ఎన్.మూర్తి జ్యోతి ప్రజ్వలన చేయగా, జిల్లా సత్యసాయి సేవా సంస్థల సమన్వయకర్త సూర రామచంద్రరావు మూడు సార్లు ఓంకారం చేసి గణపతి ప్రార్థనతో పర్తియాత్ర లింకు భజనకు శ్రీకారం చుట్టారు. అనంతరం పట్టణంలోని సాయి గణేష్ మందిరంలో, పీఎన్ కాలనీ మందిరం, అరసవల్లి, శ్రీకూర్మం, పొందూరు, చిన్న కొంగరాం, బ్యాంకర్స్ కాలనీ, తోలాపి, న్యూకాలనీ, సతివాడ, పెద్దమందిరంలో ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు భజనలు చేశారు. కార్యక్రమంలో డీఈవో కె.వెంకటేశ్వరరావు, జోనల్ కన్వీనర్ పప్పల నాగేశ్వరరావు, వెంకటరావు, పైడి కోటేశ్వరరావు, పి.ఎన్.కాలనీ పూర్వ కన్వీనర్ మురళి, సీనియర్ సేవాదళ్, పర్తి సింగర్ ఎన్.వి.ఎన్.రాజు, రాము, కృష్ణ, జెడ్పీ మందిరం పూర్వ కన్వీనర్ లింగరాజు పాల్గొన్నారు.

పలాసలో అదృశ్యం.. ఆగ్రాలో ప్రత్యక్షం


పలాసలో తిరిగి సొంతం చేసుకున్న బైకుతో మున్సిపల్ ఉద్యోగి ఉదయ్ శంకర్ పాత్రో

కాశీబుగ్గ: పలాసలో దొంగిలించిన బైక్ రూపు రేఖలు మార్చి మూడు రోజుల్లోనే రాష్ట్రాలు దాటించేసిన ఘటన పలాసలో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి బైక్ యజమాని తెలిపిన వివరాల మేరకు.. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న ఉదయ్‌శంకర్ పాత్రో మే 27న తన బండిని పోగొట్టుకున్నారు. పరిసర ప్రాంతాల్లో ఎంతగా గాలించినా ప్రయోజనం లేకపోయింది. అక్కడకు మూడు రోజుల తర్వాత ఆగ్రాకు యాభై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫతియాబాద్ పోలీసుల నుంచి ఆయనకు ఫోన్ కాల్ వచ్చింది. అక్కడ వాహన తనిఖీల్లో పోలీసులకు ఓ బండి దొరికిందని, ఇంజిన్ వివరాలను పరిశీలిస్తే పలాసకు చెందిన బైక్ అని నిర్ధారణ జరిగిందని వారు చెప్పారు. అయితే ఆ వాహనం ఫొటోలు చూసి ఉదయశంకర్ పోల్చుకోలేకపోయారు. తన బండి అలా ఉండదని చెప్పేశారు. కానీ అక్కడి పోలీసులు మాత్రం ఇంజిన్ వివరాలు మీ పేరు మీదే ఉన్నాయని స్పష్టం చేశారు. ట్యాంక్ కవర్ చించేసి, అద్దాలు తీసేసి రూపురేఖలు మార్చేశారని వివరించారు. దీంతో ఆయన వెంటనే ఫతియాబాద్ వెళ్లి వాహనాన్ని పరిశీలించి అక్కడి పోలీసులకు సీ–బుక్ చూపించడంతో వివరాలన్నీ సరిపోయాయి. దీంతో ఆయనకు ష్యూరిటీపై బైక్‌ను తిరిగి అప్పగించారు. బైక్ దొంగతనాలు చేస్తున్న దొంగలు తెలివి మీరిపోయారని, రెండు మూడు రోజుల్లోనే బైక్ రూపురేఖలు మార్చేసి లారీలు ఎక్కించి రాష్ట్రాలు దాటించేస్తున్నారని బాధితుడు తెలిపారు. వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు.

నిర్వాసితులను మోసం చేసింది చంద్రబాబే

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి


ఎల్.ఎన్.పేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్ పేట: వంశధార నిర్వాసితులను నిండా ముంచింది చంద్రబాబేనని, అంత మోసం చేసి మళ్లీ 10వ తేదీన వంశధార ప్రాజెక్టు పరిశీలనకు రావడం విడ్డూరంగా ఉందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. ఆమె మంగళవారం పాతపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడారు. 2018లో వంశధార నిర్వాసితులను నిర్దాక్షిణ్యంగా గ్రామాల నుంచి బయటకు గెంటేసిన చంద్రబాబు ఇప్పుడు ప్రాజెక్టు పరిశీలనకు రావటం హాస్యాస్పదంగా ఉందన్నారు. సంక్రాంతి పండగ గ్రామంలో నిర్వహించుకుని, స్వచ్ఛందంగా ఖాళీ చేసి వెళ్లిపోతామని నిర్వాసితులు 2018లో అప్పటి ప్రభుత్వాన్ని కోరినా చంద్రబాబు పట్టించుకోలేదని గుర్తు చేశారు. ఎముకలు కొరికే చలిలో బలవంతంగా బయటకు పంపించారని అన్నారు. పుంగనూరులో చంద్రబాబు పర్యటన సందర్భంగా టీడీపీ నాయకులను రెచ్చగొట్టి పోలీసులపైకి ఉసిగొలిపారని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన చంద్రబాబు ప్రజలను రెచ్చగొట్టేందుకే వస్తున్నారని ప్రజలు భయపడుతున్న పరిస్థితులు వచ్చాయన్నారు. వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారంగా జగనన్న రూ.216.72 కోట్లు విడుదల చేశారని, ఇప్పటికే రూ.162 కోట్లు చెల్లించామన్నారు. రూ.44 కోట్లు ఇంకా చెల్లించాల్సి ఉందని వారందరికీ ఈ నెలలో చెల్లించేందుకు రంగం సిద్ధం చేశారని వివరించారు. నిర్వాసితుల బ్యాంకు ఖాతాలకే ప్రభుత్వం అదనపు పరిహారం జమ చేస్తుందన్నారు. చంద్రబాబు పాలనలో వారికి నచ్చిన వారికి చెక్కులు ఇచ్చి నిధులు స్వాహా చేసుకున్నారని దుయ్యబట్టారు. ఆమెతో పాటు నిర్వాసిత గ్రామాలకు చెందిన పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న మదన్‌మోహన్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మజ్జి మదన్‌మోహన్ కోరారు. సంఘ రాష్ట్ర ప్రతినిధుల పిలుపు మేరకు ఈ నెల 12వ తేదీన శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాను చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రధానోపాధ్యాయుల సంఘ కార్యాలయంలో సన్నాహక సమావేశం మంగళవారం జరిగింది. నాయకులు మాట్లాడుతూ.. పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని, బదిలీలు, ప్రమోషన్లు జరిగిన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని కోరారు. సమావేశంలో ఫ్యాప్టో సెక్రెటరీ జనరల్ కొమ్ము అప్పలరాజు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, ఏపీటీఎఫ్ (1938) నాయకుడు టి.చలపతిరావు, డీటీఎఫ్ ప్రతినిధి పి.కృష్ణారావు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ల జారీపై విచారణ


తోలాపి వాసులను విచారిస్తున్న సూర్యారావు తదితరులు

నరసన్నపేట: పొందూరు మండలం తోలాపి గ్రామానికి చెందిన 24 మందికి సదరం కార్యక్రమంలో భాగంగా దివ్యాంగుల సర్టిఫికెట్ల జారీపై అధికారులు విచారణ ప్రారంభించారు. నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యారావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు మంగళవారం విచారణ నిర్వహించారు. తోలాపికి చెందిన పొన్నాడ అప్పారావు జిల్లా కలెక్టర్‌కు స్పందనలో తమ గ్రామానికి చెందిన 24 మంది అక్రమంగా దివ్యాంగులుగా సర్టిఫికెట్లను నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన సదరంలో పొంది ప్రభుత్వం నుంచి పింఛన్లు పొందుతున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలని టెక్కలి జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యారావును ఆదేశించారు. దీంతో ఆయన మంగళవారం నరసన్నపేట వచ్చి విచారణ చేపట్టారు. 24 మందికి ఇచ్చిన సర్టిఫికెట్లు సక్రమమా.. అక్రమమా అనేది విచారణ చేసి లబ్ధిదారుల నుంచి వివరాలు తీసుకున్నారు. దీనిపై నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామన్నారు. కాగా తోలాపికి చెందిన 24 మందికి అంగవైకల్యం పూర్తి స్థాయిలో లేకపోయినప్పటికీ నరసన్నపేట సదరంలో వైద్యులు అధికంగా ఉన్నట్లు సర్టిఫికెట్లు ఇచ్చినట్లు తెలిసింది. విచారణలో స్థానిక ఆస్పత్రి వైద్యురాలు స్ఫూర్తి, ఏఓ సంతోష్ ఉన్నారు.

సేవలకు గుర్తింపు..



ఏఎస్పీ తిప్పేస్వామి, డీఎస్పీ శృతికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన శ్రీకాకుళం అదనపు ఎస్పీ (అడ్మిన్ విభాగం), సబ్ డివిజనల్ డీఎస్పీ జె.తిప్పేస్వామి వై.శృతి రాష్ట్రస్థాయిలో ప్రత్యేకంగా గుర్తింపు లభించింది. వీరి సేవలనకు గుర్తింపుగా రాష్ట్ర డైరెక్టర్ జనరల్ పోలీస్ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రశంసాపత్రాలను పంపించారు. వీటిని జిల్లా ఎస్పీ రాధిక తన చేతుల మీదుగా తిప్పేస్వామి, శృతిలకు మంగళవారం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (క్రైమ్) టి.పి.విఠలేశ్వరరావు ఉన్నారు.

కొనసాగుతున్న వీఆర్‌ఏల దీక్షలు


దీక్షలో పాల్గొన్న వీఆర్‌ఏలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కారించాలని సంఘ నాయకులు కోరారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో రెండో రోజైన మంగళవారం కూడా కలెక్టరేట్ వద్ద గల జ్యోతిబాపూలే పార్క్ వద్ద దీక్షలు కొనసాగించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, వీఆర్‌ఏ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అల్లు సత్యనారాయణ కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.సూర్యనారాయణ, తాడేల త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.